క్లుప్తంగా

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి


బహుమతి అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

నంద్యాల(అర్బన్): పోస్టల్ శాఖ అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పోలూరు గ్రామంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జనంలోకి మనం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోస్టల్ కార్యాలయాల్లో గ్రామీణ తపాలా, జీవిత బీమా, సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ తదితర సౌకర్యాలను వినియోగించుకోవాలని కొరారు. గ్రామ ఇన్‌చార్జ్ బాలచంద్రారెడ్డి, ఎస్పీఎం అలీసా పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్‌పై భయం వద్దు


మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జైషేత్వార్

నంద్యాల టౌన్: బ్లడ్ క్యాన్సర్ బాధితులను అత్యాధునిక వైద్యం ద్వారా కాపాడవచ్చని యశోదా హాస్పిటల్ సీనియర్ హెమటాలజిస్ట్ బి.ఎం.టి డాక్టర్ గణేష్ జైషేత్వార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో బ్లడ్ క్యాన్సర్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్‌ను నూతన వైద్య విధానంతో నయం చేసి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మారవచ్చన్నారు. క్యాన్సర్ బారిన పడిన రోగుల శరీరంలో క్యాన్సర్ కణాలపై సర్జికల్ స్ట్రైక్ చేసి ఎందరికో పునర్జన్మ ఇచ్చామని చెప్పారు. ఈ క్యాన్సర్‌కు ఆధునిక కిమోథెరపీ, ఇమ్యూనో థెరపీ ,బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ వంటి అత్యంత ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నంద్యాలలోని యశోద హాస్పిటల్‌లో ప్రతి మూడవ బుధవారం క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో బ్లడ్ క్యాన్సర్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నిందితుడిని శిక్షించాలి

నంద్యాల(అర్బన్): బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామంలో గిరిజన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడురాజునాయక్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..నిందితుడిపై బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. శిక్షలు కఠినంగా లేకపోతే ఇలాంటి చర్యలు పునరావృతమవుతుంటాయన్నారు. రవి నాయక్, వెంకటేశ్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని సామియాకు యూత్ ఫెస్టివల్ పోటీల్లో ద్వితీయ బహుమతి లభించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి బుధవారం మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్‌లో తమ విద్యార్థిని ద్వితీయ స్థానాల్లో నిలిచిందని చెప్పారు. ఆమెను అధ్యాపకులతో కలిసి అభినందించారు.

దేవస్థానం మాజీ చైర్మన్ మృతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మూలమఠం భీమలింగేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ సన్నాల శకుంతలమ్మ (63) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త ప్రస్తుతం మూలమఠం చైర్మన్ సన్నాల వెంకటరెడ్డి మాట్లాడుతూ దేవస్థాన అన్నదాన కమిటీ సభ్యురాలిగా సేవలు అందించారన్నారు. గురువారం నూనెపల్లె శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నూతన విధానంతో రోగులకు ఇబ్బందులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పేషంట్లకు ఇబ్బందులు కలిగించే అభాను తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, సుబ్బరాయుడు కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ విభాగం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆయుష్మాన్‌భవ యాప్ వల్ల పేషంట్లు, వారి బంధువులు ఓపీ కోసం క్యూలైన్‌లో గంటల కొద్దీ నిలవాల్సి వస్తుందని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆధార్ కార్డు, స్మార్ట్ ఫోన్ తీసుకువస్తేనే ఓపీ ఇస్తున్నారన్నారు. అత్యవసర సమయాల్లో ఇవన్నీ తీసుకురావడానికి కొన్ని వీలు కాకపోవచ్చని, రోగులకు వైద్యం అందించేందుకు పాత పద్ధతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సూపర్‌వైజర్ల నియామకం

శిరివెళ్ల: మండలంలో ఇద్దరు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లను బుధవారం నియమించారు. శిరివెళ్ల క్లస్టర్‌కు స్వర్ణలత జమ్మలమడుగు నుంచి బదిలీపై వచ్చారు. గోవిందపల్లె క్లస్టర్‌కు రషీద్ బేగం నియమితులయ్యారు. ఈమె ప్రొద్దుటూర్ నుంచి బదిలీపై వచ్చారు. కాగా గత సూపర్‌వైజర్ అనురాధ నంద్యాలకు బదిలీపై వెళ్లారు.






శిరివెళ్లలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు , యర్రగుంట్లలో అన్నదానం, మునగాలలో నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు,గుండుపాపలలో వినాయకుడికి నైవేద్యం సమర్పిస్తున్న దృశ్యం, క్రిష్టిపాడులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

వినాయకా వీడ్కోలు..

- మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు
- గ్రామాల్లో ప్రత్యేక పూజలు, లడ్డూల వేలం, అన్నదానం
- రంగులు చల్లుకుంటూ, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపుగా విగ్రహాల తరలింపు
- కేసీ కెనాల్, తెలుగుగంగ, చెరువులు, కుంటల్లో నిమజ్జనం


కానాలలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథులు

నంద్యాల(అర్బన్): వినాయక చవితి భాగంగా బుధవారం గణేష్ నిమజ్జనోత్సవాలను గ్రామీణ ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భాగంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి లడ్డూకు వేలం చేపట్టారు. అన్నదానం అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా రంగులు చల్లుకుంటూ తీసుకెళ్లారు. చాబోలు, కానాల, అయ్యలూరు, పెద్దకొట్టాల,కొత్తపల్లె, భీమవరం, పులిమద్ది, మునగాల, పోలూరు, చాపిరేవుల, మిట్నాల, పుసులూరు తదితర గ్రామాల్లో నిమజ్జనోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు.

గోస్పాడు: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో మూడు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణేషుడిని బుధవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. విగ్రహాల వద్ద లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో రంగులు చల్లుకుంటూ గణపతి బప్పా మోరియా, గణేష్ మహరాజ్‌కీ జై, జైజై గణేషా అంటూ గ్రామోత్సవం నిర్వహిస్తూ తరలించారు. విగ్రహాలను ఆయా గ్రామాల సమీపంలోని కాలువుల, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో గణపతి నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణేషుని ప్రతిమలను మూడవ రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, మండపాల వద్ద సామూహిక అన్నదానం అనంతరం లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. అనంతరం వాహనాల్లో ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు.

శిరివెళ్ల: మండలంలో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా ప్రశాంతంగా జరిగింది. మూడు రోజుల పాటు భక్తుల నుంచి పూజలందుకున్న స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలపాల వద్ద లడ్డూల వేలం జరిగాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రజలు విగ్రహాలను ఊరేగింపుగా, రంగులు చల్లుకుంటూ.. కేసీ కెనాల్, తెలుగు గంగ, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దొర్నిపాడు: మండలంలో వినాయక చవితి సందర్భంగా కొలువైన విగ్రహాలను బుధవారం ఆయా గ్రామాల్లో నిమజ్జనం చేశారు. యువకులు రంగులు జల్లుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఊరేగించి కేసీ, కుందూ, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రుద్రవరం: మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమం సంబరంగా నిర్వహించారు. 21 పంచాయతీల పరిధిలో 77 ప్రతిమలను కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం మధ్యాహ్నం నుంచి మండపాల్లో కొలువు దీర్చిన ప్రతిమలకు ప్రత్యేక పూజల అనంతరం రంగులు జల్లుకుంటూ మేళతాళలతో ఊరేగింపుగా గ్రామ శివారులో ఉన్న కుంటలు, చెరువులు, తెలుగు గంగ కాల్వల్లో నిమజ్జనం చేశారు.

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో బుధవారం గణేష్ శోభాయాత్ర ఉల్లాసంగా కొనసాగింది. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వాహనాల్లో తరలించారు. ఉయ్యాలవాడలో 11, గ్రామాల్లో 52 విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవ కమిటీ నిర్వహకులు గణేష్ ప్రతిమలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి కుందూనదిలో నిమజ్జనం చేశారు. బోడెమ్మనూరులో లడ్డు వేలం నిర్వహించగా కట్టమీది సుబ్బయ్య రూ. 51 వేలకు దక్కించుకున్నారు. హరివరం గ్రామంలో ఆటల పోటీల 150 మంది విజేతలకు నిర్వహకులు బహుమతులు అందజేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా సుమారు 73 వినాయక విగ్రహాలను ఆయా గ్రామాలలోని మంటపాలలో కొలువుదీర్చి మూడు రోజుల పాటు భక్తులు విశేష పూజలు నిర్వహించి బుధవారం వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి కూలూరు రస్తాలోని కుందూలో నిమజ్జనం చేశారు. ఉరేగింపులో బాణాసంచా కాలుస్తుండగా శివాలయం వీధికి చెందిన ఓ మహిళ ముఖానికి స్వల్ప గాయలయ్యాయి. ఆమెను ఎస్‌ఐ రమణయ్య కెరళ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి, విచారిస్తున్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ హనుమంతు నాయక్ బుధవారం గ్రామస్తులకు సూచించారు. గతేడాది లాంటి ఘటనలు పునరావృతం కాదని చెప్పారు. గ్రామంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా గ్రామంలో 8 విగ్రహాలను కొలువదీర్చారు. బుధవారం సాయంత్రం విగ్రహాలను నిమజ్జానానికి తరలించారు.



పసురుపాడులో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం, రంగులు చల్లుకుంటున్న యువకులు


యాళ్లూరులో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


రుద్రవరం రంగారెడ్డి చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు


చాగలమర్రి: కుందూలో గణేశుడి విగ్రహాలను నిమజ్జనం చేసిన దృశ్యం


బోడెమ్మనూరులో లడ్డు వేలం నిర్వహిస్తున్న దృశ్యం


ఆలమూరులో నిమజ్జనానికి తరలిన గణనాథుడు

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: ఆయుస్మాన్ భవ పథకం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకుందామని రాష్ట్ర జలవనరుల సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అధ్యక్షతన అయుస్మాన్ భవ కార్యక్రమం ప్రారంబోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వైద్యాధికారులు తిరుపేలయ్య, రాజ్యలక్ష్మీ, రాధికాజ్యోతి, కిశోర్, చంద్రశేఖర్‌రెడ్డి, శభరీష్, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి,మున్సిపల్‌కమిషనర్ రమేష్‌బాబు, తహసీల్దార్లు హరినాథ్‌రావు, రవి, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ ఉన్నారు.

నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోండి


మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, గణేష్ మహోత్సవ కమిటీ నాయకులు

నంద్యాల: ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జోత్సవాన్ని మతసామరస్యంతో ఒకరినొకరు సహకరించుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులతో రెండవ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సామాజిన మాధ్యమాల్లో ప్రసారమయ్యే రూమర్లను ప్రజలు నమ్మవద్దని విస్తృత ప్రచారం కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు సూచించిన రూట్ మ్యాప్ ప్రకారం అధికారుల చేపట్టాల్సిన పనులు నేటి సాయంత్రంలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రార్థన సమయాల్లో ఎలాంటి డ్రమ్స్, అధిక శబ్దాలతో వాయిద్యాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో దాదాపు 260 విగ్రహాలు నిమజ్జనం కానున్నాయని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నామని డీఎస్పీ మహేశ్వరరెడ్డి సమాధానమిచ్చారు. దాదాపు 500 మంది పోలీస్ బందోబస్తుతో భద్రతా చర్యలు చేపడతామన్నారు. రోడ్ ప్యాచ్ వర్కులు, భారీ కేడింగ్, అవసరమైన చోట వైద్య శిబిరాలు, చెరువులో పుట్టీలు, స్విమ్మర్లు ఏర్పాటు చేసుకొని నిమజ్జనం పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారుల బృందం ఉండేలా చూడాలని ఆర్డీఓ శ్రీనివాసులకు సూచించారు. ఊరేగింపులో ముఖ్య కూడళ్లల్లో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డీఆర్ఓ పుల్లయ్య, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి విజయకుమార్, జి.రామకృష్ణారెడ్డి, కార్యాధ్యక్షుడు వైద్యం నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నెరవాటి అమర్నాథ్, సివి చలం బాబు, నిమ్మకాయల సుధాకర్, కోశాధికారులు ధమాం శంకర్, రమణ పాల్గొన్నారు.

లీడర్ షిప్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గోస్పాడు: ప్రధానోపాధ్యాయులకు ఇచ్చే లీడర్‌షిప్ శిక్షణను ఏ జిల్లా వారికి ఆ జిల్లాలోనే ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ మండల ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు నాయక్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల్లో శిక్షణ ఏర్పాటు చేయడం వల్ల అనారోగ్యంతో ఉన్న వారు, చిన్న పిల్లలు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంపాదిత సెలవులను ఖాతాల్లో జమ చేయాలని, సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. విజయరావు, సురేష్ కుమార్, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, సికిందర్ పాల్గొన్నారు.

వర్గీకరణ చేసే వరకు ఉద్యమం

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయకాటి బెనర్జీ మాదిగ తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని బుధవారం ఎమ్మార్పీస్, ఎమ్ఎస్ఎఫ్ తదితర అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బెనర్జీ మాట్లడుతూ అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు అవుతున్నా కేంద్ర ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నంద్యాల(అర్బన్): పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమానికి పాటు పడాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు భద్రతలేని గ్యారంటీ పెన్షన్ స్కీంను ఆమోదించడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి భద్రత ఉండే పెన్షన్ స్కీంను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో లక్ష్మణ్ నాయక్, శ్రీనివాసులు, రాజు, భాస్కర్, దేవేంద్రుడు పాల్గొన్నారు.


కేఎస్ఆర్ కాలనీలో పూజల్లో పాల్గొన్న మహిళలు


బొమ్మలసత్రంలో భద్రకాళి ప్రదర్శన

పూజలందుకుంటున్న వినాయకులు


క్రాంతినగర్ మోడల్ కాలనీలో ఏర్పాటైన మట్టి వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం


హోమం చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి పండుగను పట్టణంలోని వివిధ మండపాల్లో కొలువుదీరిన వినాయకుడికి మూడో రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అపార్ట్‌మెంట్‌లలో చిన్న పిల్లలతో భగవద్గీత శ్లోకాలు, లలితా, విష్ణుశ్వర సమస్తనామాల పారాయణం, మ్యాజిక్‌షోలు చేపట్టారు. చిత్తులూరి వీధిలో రూ.2.5 లక్షల కరెన్సీ నోట్లతో మండపాన్ని అలంకరించారు. బాలాజీ కల్యాన మండపంలో లోకకళ్యాణం కోసం సుబ్రహ్మణ్య స్వామి హోమం, లక్ష్మి గణపతి, నవగ్రహ శాంతి హోమాలు అర్చలు ఈశ్వర్ నిఖిలేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో జరిపించి భక్తులకు అన్నదానం చేశారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీ భగవత్ సేవా సమాజ్ వారి ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం గణపతి హోమం చేపట్టారు. బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ కింద వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణేష్ విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. బుధవారం సాయంత్రం చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు అలంరించాయి.


చిత్తలూరి వీధిలో కరెన్సీ వినాయకుడు

ఆశాజనకంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): జిల్లా కేంద్రంలోని టెక్కె మార్కెట్‌యార్డులో ఎండు మిర్చి అమ్మకాలు లాభసాటిగా నడుస్తున్నాయి. బుధవారం మార్కెట్‌లో సూపర్-10, తేజ, సూపర్-5 రకాల అమ్మకాలు జరిగాయి. సూపర్-10 జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.23,500, మోడల్ ధర క్వింటా రూ.21800, కనిష్ట ధర రూ.18,500 పలికింది. ఇదే రకం తాలు కాయ గరిష్ట ధర క్వింటా రూ.12,300, మోడల్ ధర క్వింటా రూ.12వేలు, కనిష్ట ధర రూ.11,600గా నమోదైంది. ఇక తేజ రకం జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.19,400, మోడల్ ధర క్వింటా రూ.19,300, కనిష్ఠం రూ.19,400కు అమ్ముడైంది. సూపర్-5 రకం జనరల్ క్వింటా గరిష్ట ధర రూ.22,500, మోడల్ ధర క్వింటా రూ.22,500, కనిష్ట ధర రూ.22,500గా నమోదైనట్లు మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు.

కాటేసిన కరెంట్..


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు ప్రతాప్

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామ శివారులోని రామాపురం పరిధిలోని పొలంలో విద్యుత్ షాక్‌కు గురై ప్రతాప్ (35)అనే రైతు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ మండలం, బాచేపల్లె గ్రామానికి చెందిన ప్రతాప్ రామాపురం వద్ద తన సొంత పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంటకు నీరు పెట్టడానికి వెళ్లగా విద్యుత్ మోటారు స్టార్టర్ పనిచేయకపోవడంతో మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తూ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చాగలమర్రి పోలీసులు సంఘటనా స్థలానికి చెరుకొని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

నిందితులకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): వివిధ కేసుల్లో నిందితులకు సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి బుధవారం జైలు శిక్ష ఖరారు చేశారని పోలీసులు తెలిపారు. కల్లె ఉమామాహేశ్వరుడు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా 30 రోజులు జైలు శిక్ష విధించారని చెప్పారు. స్వర్ణ శేఖర్ మద్యం సేవించి మోటార్ సైకిల్ నడుపుతూ ఒకటవ పట్టణ పోలీసులకు పట్టుబడటంతో కోర్టులో హాజరు పరచగా 5 రోజులు జైలు శిక్ష విధించినట్లు వివరించారు.




చెన్నూరు- ఇసుక పల్లెకు వేసిన నూతన రోడ్డు ,దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గదులు, శిరివెళ్లలో పూర్తయిన సీసీ రోడ్డు

ప్రారంభానికి సిద్ధం


చెన్నూరులో పూర్తయిన గ్రామ సచివాలయ భవనం

శిరివెళ్ల: మండలంలో వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అభివృద్ధికి నోచుకోని చెన్నూరు- ఇసుకపల్లె గ్రామీణ రోడ్డు రూ. 95 లక్షలతో బాగు చేశారు. 2019 సాధారణ ఎన్నికలలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్డును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే రూ. 42 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. మండల కేంద్రం శిరివెళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం, నియోజక అభివృద్ధి నిధులు, జెడ్పీ నిధులు మొత్తం రూ.1.43 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాల్వలు పూర్తయ్యాయి. వాటిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింప చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.76 కోట్లతో నిర్మించిన ఎనిమిది తరగతి గదులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. నాబార్డు నిధులతో నిర్మించిన ఈ గదులు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరనుంది. ప్రస్తుతం పాఠశాలలో 700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వీటిని త్వరలో ప్రారంభించనున్నారు. ఇటీవల డీఈఓ సుధాకర్‌రెడ్డి పరిశీలించి మైనర్ పనులు ఉంటే వెంటనే పూర్తిచేయాలని ఆదేశించడంతో పనులు పూర్తి చేశారు.